నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, శుక్రవారం 11 ఏప్రిల్ 2025 | KAMAREDDY

సమాజంలో గౌరవప్రదంగా జీవించాలి

స్వయం సహాయక సంఘాలకు రూ.2.50 కోట్ల చెక్కును అందజేస్తున్న జిల్లా జడ్జి సునీత కుంచాల, కలెక్టర్, సీపీ

కంఠేశ్వర్, ఏప్రిల్ 10 : వివిధ పరిస్థితుల కారణంగా సమాజంలో దుర్భర స్థితిలో జీవనాలు వెళ్లదీస్తున్న వారు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న చేయూతను సద్వినియోగం చేసుకుని గౌరవప్రదంగా జీవించాలని జిల్లా జడ్జి సునీత కుంచాల సూచించారు. కలెక్టరేట్‌లో జిల్లా న్యాయం సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం మినీ మాడ్యూల్ క్యాంప్ నిర్వహించారు. దాతల సహకారంతో పలువురికి కుట్టుమిషన్లు, ప్రభుత్వ బాలికల పాఠశాలలు, డిచ్‌పల్లి మానవతా సదన్, కస్తూర్బా విద్యాలయాలకు శానిటరీ నాప్కిన్ వెండింగ్ మిషన్లు పంపిణీ చేశారు. లేబర్ డిపార్ట్‌మెంట్ తరపున అసంఘటిత రంగ కార్మికులకు గుర్తింపు కార్డులను, మెప్మా ఆధ్వర్యంలో 21 స్వయం సహాయక సంఘాలకు రూ.2.50 కోట్ల విలువ గల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కును కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ సాయిచైతన్యతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లు, సెక్స్‌వర్కర్లు, అసంఘటితరంగ కార్మికుల ఉపాధి అవకాశాలు మెరుగుపర్చి, పేదరిక నిర్మూలనకు పాటుపడాలనే డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో ఈ మాడ్యూల్ క్యాంపును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆయా వర్గాల అభ్యున్నతిని కాంక్షిస్తూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందిస్తున్న తోడ్పాటును లబ్ధిదారులు సద్వినియోగం చేసుకున్నప్పుడే, చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలకు సార్థకత చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పద్మావతి, హైకోర్టు బార్ కౌన్సిల్ సభ్యుడు రాజేందర్‌రెడ్డి, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్‌గౌడ్, వివిధ శాఖల అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా జడ్జి సునీత కుంచాల

షకీల్ మాతృమూర్తికి కన్నీటి వీడ్కోలు

అంతిమయాత్రలో పాడె మోస్తున్న మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

మాతృమూర్తిని ముద్దాడుతూ విలపిస్తున్న మాజీ ఎమ్మెల్యే షకీల్

షగుఫ్త ఆదిబ్ (ఫైల్)

బోధన్, ఏప్రిల్ 10: బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ మాతృమూర్తి షగుఫ్త ఆదిబ్ (78) అంత్యక్రియలు గురువారం సాయంత్రం బోధన్‌లో నిర్వహించారు. కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీటి వీడ్కోలు పలికారు. తీవ్ర అస్వస్థతకు గురైన ఆదిబ్ హైదరాబాద్‌లోని యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి కన్నుమూశారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రభుత్వ ప్రధానోపాధ్యాయురాలు అయిన షగుఫ్త ఆదిబ్ 2005లో ఉద్యోగ విరమణ చేశారు. ఆమెకు బోధన్ పట్టణంలో మంచి పేరుంది. దుబాయ్‌లో ఉంటున్న షకీల్ తల్లి మరణవార్త తెలియగానే హుటాహుటిన బయలుదేరి వచ్చారు. శంషాబాద్ విమానాశ్రయంలో మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేశ్‌గుప్తా, జీవన్‌రెడ్డి ఆయనను రిసీవ్ చేసుకున్నారు. ఎయిర్‌పోర్టు నుంచి షకీల్ నేరుగా బోధన్‌కు చేరుకోగా, అప్పటికే ఆయన మాతృమూర్తి పార్థివదేహాన్ని ఇంటికి తరలించారు. తల్లి మృతదేహాన్ని చూసి ఆయన దుఃఖాన్ని ఆపుకోలేక పోయారు. తల్లి నుదుటిని ముద్దాడుతూ చిన్న పిల్లాడిలా విలపించారు.

పరామర్శించిన జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి

షగుఫ్త ఆదిబ్ అంత్యక్రియలు గురువారం సాయంత్రం బోధన్‌లో నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తదితరులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. షకీల్‌తో కలిసి జీవన్‌రెడ్డి పాడె మోశారు. అంతకుముందు షకీల్, ఆయన సతీమణి ఆయేషా ఫాతిమా, సోదరుడు సోహెల్‌ను వారు పరామర్శించారు. బీఆర్ఎస్ నేతలు గోగినేని నర్సయ్య, సంజీవ్‌కుమార్, డి.శ్రీరామ్, నర్సింగ్‌రావు, భూమారెడ్డి, రవీందర్ యాదవ్, పి.రవికిరణ్, గిర్దావర్ గంగారెడ్డి, రజితా యాదవ్ తదితరులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

కామారెడ్డిలో విషాదం

నీటి కుంటలో పడి ఇద్దరు బాలురు మృతి

స్నానం కోసం వెళ్లి ఈతరాక దుర్మరణం

కామారెడ్డి, ఏప్రిల్ 10 : కామారెడ్డిలో విషాదం నెలకొన్నది. ఈత కోసం వెళ్లి ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి ఇద్దరు బాలురు మృతి చెందారు. ఈ ఘటన కామారెడ్డి మండలం క్యాంసంపల్లి తండాలో చోటుచేసుకున్నది. దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. క్యాసంపల్లి తండాకు చెందిన తేజావత్ రాజీ– రవి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కొడుకు దుబాయ్‌లో ఉండగా చిన్న కుమారుడు తేజావత్ సాయికుమార్ (16) క్యాటరింగ్, ముత్యంపేట్‌లోని కల్లు దుకాణంలో పనిచేస్తున్నాడు. ఈ నెల 8న ఉదయం సాయికుమార్, తేజావత్ రాజీ ఆడబిడ్డ కుమారుడు భుక్యా సురేశ్ (15)తో కలిసి బయటికి వెళ్లారు. రాత్రయినా ఇద్దరూ ఇంటికి రాకపోవడంతో చుట్టపక్కల, బంధువుల ఇండ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం రాఘవపూర్ శివారులోని నర్సారెడ్డి కుంటలో రెండు మృతదేహాలు బయటపడగా..కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా తేజావత్ సాయికుమార్, భుక్యా సురేశ్‌గా గుర్తించారు. స్నానం చేయడానికి వెళ్లి ఈతరాకపోవడంతో నీట మునిగి చనిపోయినట్లు ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో అకాల వర్షం



బీర్కూర్ మండల కేంద్రంలో తడిసిన ధాన్యం

కోటగిరిలో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతు

కందర్‌పల్లి– బిచ్కుంద ప్రధాన రహదారిపై అడ్డంగా పడిపోయిన చెట్టును తొలగిస్తున్న జీపీ సిబ్బంది

- పలు మండలాల్లో తడిసిన ధాన్యం
- నిజామాబాద్ మార్కెట్ యార్డులో పసుపు బస్తాల్లో చేరిన వర్షపు నీరు

కోటగిరి/ రుద్రూర్/ నస్రుల్లాబాద్/కంఠేశ్వర్/బిచ్కుంద, ఏప్రిల్ 10: ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో గురువారం అకాలవర్షం కురిసింది. కోటగిరి, రుద్రూర్, నస్రుల్లాబాద్, బీర్కూర్ తదితర మండలాల్లో ఈదురుగాలులు, ఉరుములతో కూడిన వర్షం కురవడంతో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. రోడ్లపై కాంటా చేసిన బస్తాలు కూడా తడిసిపోయాయి. ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడ్డారు. నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని మార్కెట్‌యార్డులో పసుపు బస్తాల్లోకి వర్షపు నీరు చేరింది. బిచ్కుంద మండలంలో వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. సుమారు గంట పాటు కురిసిన వర్షానికి వరి, జొన్న, మక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. చేతికొచ్చిన పంట నేల పాలయ్యిందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.కందర్‌పల్లి–బిచ్కుంద ప్రధాన రహదారిపై చెట్లు పడి పోవడంతో జీపీ కార్యదర్శి ట్రాక్టర్ సహాయంతో తొలగింపజేశారు.

అంతా కుమ్మక్కై..

బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల్లోని దామరంచ, అంకోల్, అంకోల్ క్యాంపు, దుర్కితో పాటు గాంధారి మండలం గౌరారంలో కల్తీ కల్లు కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఆయా గ్రామాలకు చెందిన దాదాపు వంద మంది అస్వస్థతకు గురై దవాఖానలో చేరారు. పలువురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. అయినప్పటికీ ఆబ్కారీ శాఖ పూర్తి స్థాయిలో తనిఖీలు చేపట్టలేదు. అక్రమార్కులతో కొంత మంది సిబ్బంది కుమ్మక్కవడం, కల్లు తయారీలో నిషేధిత పదార్థాలను వినియోగిస్తున్నారని తెలిసినా పట్టించుకోకపోవడం ప్రజలకు శాపంగా మారింది. నస్రుల్లాబాద్ ఘటన వెలుగు చూసిన వెంటనే యంత్రాంగం స్పందించి ఉంటే గాంధారి మండలం గౌరారం ఉదంతం జరిగేది కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. కల్తీ కల్లు ఘటనతో అవాక్కైన అధికారులు తమ తప్పును సరిదిద్దుకునే క్రమంలో పలువురిపై కేసులు నమోదు చేశారు. ఒకటి, రెండు కల్లు బట్టీలను మూసేశారు. అయితే, అసలు సూత్రధారులను మాత్రం వదిలేశారని విమర్శలు వినిపిస్తున్నాయి. కామారెడ్డిలో విస్తృత తనిఖీలు నిర్వహించి కేసులు పెట్టినప్పటికీ నిజామాబాద్‌లో తూతూ మంత్రంగానే తనిఖీలు చేస్తున్నట్లు చెబుతున్నారు.

ఆబ్కారీ..అంతే మరీ!

- ఉప్పొంగుతున్న కల్తీ కల్లు
- కాలు కదపని ఎక్సైజ్‌శాఖ
- కామారెడ్డి ఘటనతోనైనా మేల్కొనని వైనం
- తూతూ మంత్రంగానే తనిఖీలు
- చక్రం తిప్పుతున్న అధికార పార్టీ నేతలు
- ఉమ్మడి జిల్లాలో జోరుగా నిషేధిత మత్తుపదార్థాల వినియోగం
- కల్తీ కల్లుపై పెదవి విప్పని ఎక్సైజ్‌శాఖ మంత్రి

నిజామాబాద్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కల్తీ కల్లు ఉప్పొంగుతున్నా, అమాయకుల ప్రాణాల మీదకు వస్తున్నా ప్రభుత్వంలో చలనం కరువైంది. నిషేధిత మత్తు పదార్థాల నియంత్రణను గాలికొదిలేసింది. కామారెడ్డి జిల్లాలో కల్తీ కల్లుతో వంద మంది దాకా అస్వస్థతకు గురైతే కనీసం స్పందించలేదు. ఎక్సైజ్ శాఖ కఠిన చర్యలు చేపట్టలేదు. వాస్తవానికి ఎక్కడైనా కల్తీ కల్లు ఉదంతం వెలుగు చూస్తే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేపట్టి, అక్రమార్కుల భరతం పట్టాలి. కానీ ఆ దిశగా చర్యలే లేవు. మరోవైపు, ఆబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్నప్పటికీ కల్తీ కల్లు ఘటనపై కనీస స్పందన రాలేదు. పదుల సంఖ్యలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నా మంత్రి నుంచి ఎలాంటి ప్రకటనా వెలువడలేదు.

శాఖల మధ్య సమన్వయం కరువు..

ఆబ్కారీ శాఖ నిర్లక్ష్యానికి, క్షేత్ర స్థాయిలో అక్రమ వ్యవహారాలకు దుర్కిలోని అనుమతి లేని కల్లు బట్టి నిర్వాహణే తేటతెల్లం చేస్తున్నది. క్షేత్ర స్థాయిలో సిబ్బంది సహకారంతో అక్రమ దందా సాగుతున్నా అధికారులు పట్టించుకోలేదు. అమాయకులు అస్వస్తతకు గురవడంతో ఆబ్కారీ శాఖ లీలలు బయటపడ్డాయి. కొద్ది రోజుల క్రితం కల్తీ కల్లు సేవించిన ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. కానీ ఆబ్కారీ శాఖ, పోలీసులు కనీసం ఈ వ్యవహారంలో లోతుగా దర్యాప్తు చేయలేదు. పోలీసులు అప్పుడప్పుడు ఆల్పాజోలం పట్టుకుంటున్నారు. అయితే, పోలీసులతో చేతులు కలిపి అక్రమార్కులపై ఉక్కుపాదం మోపాల్సిన ఎక్సైజ్ శాఖ పట్టనట్టు వ్యవహరిస్తున్నది. క్లోరోహైడ్రేట్‌గా తేలితేనే తమ పాత్ర ఉంటుందని ఆబ్కారీ శాఖ చెబుతున్నది. మిగిలిన మత్తు పదార్థాలతో తమకు సంబంధం లేదని, అదంతా పోలీసులే చూసుకుంటారని వదిలేస్తున్నారు.

నిజామాబాద్‌లో కల్తీ కల్లు లేదా?

కల్తీ కల్లుకు నిజామాబాద్ జిల్లా పెట్టింది పేరు. అధికారికంగా నిర్వహించే కల్లు బట్టీలకు రెట్టింపు స్థాయిలో కల్లు దుకాణాలను నిర్వహిస్తున్నారు. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్నది. కానీ ఆబ్కారీ శాఖకు కనిపించదు. కామారెడ్డి ఘటనతో నిజామాబాద్‌లో ఆబ్కారీ శాఖ మూడు రోజుల పాటు తనిఖీలకు సిద్ధమైంది. ఈ మేరకు ముందస్తుగానే కల్లు బట్టి నిర్వాహకులకు సమాచారం ఇవ్వడంతో వారు అప్రమత్తమయ్యారు. నిషేధిత పదార్థాలను మాయం చేశారు. దీంతో తనిఖీల సందర్భంగా అంతా సవ్యంగానే ఉన్నట్లుగా ఎక్సైజ్ శాఖ చెబుతున్నది. కానీ కల్తీ కల్లు లేని దుకాణమే నిజామాబాద్‌లో లేదన్నది బహిరంగ రహస్యం. నగరంలోని పలు డిపోల్లో నాణ్యమైన కల్లు దొరకడమే లేదు. కానీ ఆబ్కారీ తనిఖీల్లో మాత్రం లోపాలే బహిర్గతం కాకపోవడం విచిత్రంగా మారింది. అధికార పార్టీలో ఓ కీలక నేత పేరు చెప్పుకుంటూ ఓ వ్యక్తి నిజామాబాద్‌లో ఆల్పాజోలం దందాను నడిపిస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. సదరు నేతపై పోలీసులు దృష్టి సారించగా, పైనుంచి మందలింపులు వచ్చినట్లు సమాచారం.

తనిఖీలు నిర్వహిస్తున్నాం...

కామారెడ్డి జిల్లా ఘటనతో అప్రమత్తమయ్యాం. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నాం. కల్లు బట్టీల్లో శాంపుల్స్ సేకరిస్తున్నాం. నిషేధిత పదార్థాలతో కల్లు తయారీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ప్రజలు మాకు సమాచారం ఇవ్వాలి.

- మల్లారెడ్డి, నిజామాబాద్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి

టీయూ, సౌత్ క్యాంపస్‌లో అధ్యాపకుల నిరసన

తెలంగాణ యూనివర్సిటీలో ర్యాలీ నిర్వహిస్తూ నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

డిచ్‌పల్లి/ భిక్కనూర్, ఏప్రిల్ 10 : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయాన్ని ముట్టడించిన వివిధ వర్సిటీల అకడమిక్ కన్సల్టెంట్లను అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ తెలంగాణ యూనివర్సిటీ, భిక్కనూర్ సౌత్ క్యాంపస్‌లో అధ్యాపకులు గురువారం ఆందోళన చేపట్టారు. టీయూలో అకడమిక్ కన్సల్టెంట్లు క్యాంపస్‌లోని తరగతులు బహిష్కరించారు. అనంతరం ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ నుంచి పరిపాలనా భవనం వరకు ర్యాలీ చేపట్టారు. విద్యార్థులతో కలిసి బైఠాయించి నిరసన, ధర్నా నిర్వహించారు. భిక్కనూర్‌లోని సౌత్ క్యాంపస్‌లో బంద్ పాటించారు. ఈ సందర్భంగా వర్సిటీ కో– ఆర్డినేషన్ కమిటీ నాయకుడు నారాయణ మాట్లాడుతూ.. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆందోళన చేపట్టిన వర్సిటీ అధ్యాపకులను అరెస్టు చేసిన రోజును తాము చీకటి దినంగా భావిస్తున్నామన్నారు. ప్రభుత్వం వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ తన మ్యానిఫెస్టోలో ప్రకటించిన ప్రకారం తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఏడో పీఆర్సీని అమలుచేయాలని కోరారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్స్ యాలాద్రి, సునీత, రమాదేవి, నర్సయ్య, ఏపీఆర్వో సరిత, నిరంజన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

'తహసీల్' ఎదుట అర్ధనగ్నంగా నిరసన

- ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని..

తహసీల్ కార్యాలయం ఎదుట అర్ధనగ్నంగా కూర్చొని నిరసన తెలుపుతున్న శ్రీనివాస్‌రావు

నాగిరెడ్డిపేట, ఏప్రిల్ 10: ఓ భూమి విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదంటూ మండలంలోని పోచారం గ్రామానికి చెందిన ఇప్ప శ్రీనివాస్‌రావు తహసీల్ ఆఫీస్ ఎదుట గురువారం అర్ధనగ్నంగా కూర్చొని నిరసన వ్యక్తంచేశాడు. పోలీసులు ఆందోళన చేస్తున్న వ్యక్తిని బలవంతంగా పక్కకు తీసుకెళ్లారు. ఈ విషయమై తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడని, కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టి, నివేదిక పంపించినట్లు తెలిపారు. ఆస్తి పంపకాల గొడవలు ఉన్నాయని, సివిల్‌కోర్టులో చూసుకోవాలని సూచించినట్లు చెప్పారు.